పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు కల్పించాలి

అందకూర్‌లోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారులు

కుంటాల, మార్చి 26 : లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు అన్ని బూత్‌లను సమాయత్తం చేయాలని సెక్టోరియల్ ఆఫీసర్ మధు అన్నారు. మరో సెక్టోరియల్ ఆఫీసర్ సుధాకర్‌తో కలిసి మంగళవారం ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లోని బూత్‌లను పరిశీలించారు. రూట్ నంబర్ 10లో కల్లూరు నుంచి దౌనెల్లి, రూట్ నంబర్ 11 అర్లీ నుంచి గొల్లమాడ ఉండగా, పోలింగ్ బూత్‌లలో కనీస వసతులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఇక్కడ మరో సెక్టోరియల్ ఆఫీసర్ సుధాకర్, రూట్ ఆఫీసర్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

బొడ్డోని కుంట పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ సత్యం

ఖానాపూర్ టౌన్, మార్చి 26 : పట్టణంలోని శాంతినగర్ కాలనీలో దుర్గంధ భరితంగా మారిన బొడ్డోని కుంటను మంగళవారం మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం అధికారులతో కలిసి పరిశీలించారు. పలు కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు కుంటలో కలువకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, మున్సిపల్ కమిషన్ మనోహర్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బస్ డిపోలో మజ్జిగ పంపిణీ

మజ్జిగ పంపిణీ చేస్తున్న అధికారులు

భైంసా, మార్చి 6 : పట్టణంలోని భైంసా ఆర్టీసీ డిపోలో మంగళవారం కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ రీజియన్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉద్యోగులు చాలా జాగ్రత్త వహించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. బస్సు కండీషన్ డ్రైవర్స్ సరిగా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎం అమృత, అసిస్టెంట్ మేనేజర్ చందు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలి

నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేశ్

సోన్, మార్చి 26 : ఎండలు మండుతున్న నేపథ్యంలో హరితహారంలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలని సోన్ ఎంపీడీవో సురేశ్ సూచించారు. లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని హరితహారాన్ని మంగళవారం సందర్శించారు. ఉదయం, సాయంత్రం నీటిని పట్టి, మొక్కలను రక్షించాలని సూచించారు. పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అనంతరం సంగంపేట్ గ్రామంలోని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరువు భత్యం అమలు చేయాలి

దస్తురాబాద్, మార్చి 26 : ఏప్రిల్ నుంచి బీడీ కార్మికులకు పెరిగిన(వీడీఏ) కరువు భత్యం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 7 లక్షల మంది బీడీ కార్మికులు ఉన్నారని, వీరికి కరువు భత్యం వర్తిస్తుందన్నారు. వెంటనే బీడీ యాజమాన్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని బీడీ యాజమాన్యాలు పెరిగిన కరువు భత్యాన్ని అమలు చేయకుండా కుట్రలు పన్నుతున్నాయని మండిపడ్డారు. ఆయన వెంట బీడీ కార్మికులు తదితరులున్నారు.

సేంద్రియ వరి సాగు పరిశీలన

అవగాహన కల్పిస్తున్న ఏఈవో అంబాజీ

సోన్, మార్చి 26 : సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామానికి చెందిన రైతుల వరి పంట పొలాలను మంగళవారం ఏఈవో అంబాజీ పరిశీలించారు. సేంద్రియం ద్వారా సాగు చేసిన ఈ పంటల గురించి అవగాహన కల్పించారు. మొక్కకు కావాల్సిన స్థూల, సూక్ష్మ పోషక పదార్థాలు నత్రజని, భాస్వరం, పోటాష్, కాల్షియం, మెగ్నీషియం, గంధకం, ఇనుము, జింక్, రాగి మొదలగు మూలకాలను సరఫరా చేస్తుందని వివరించారు. రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచి, మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

నిర్మల్ టౌన్, మార్చి 26 : జిల్లాలోని లోకేశ్వరం మండల కేంద్రంలో గల ఎస్సీ హాస్టల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ సంఘం నాయకులు మంగళవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. కనీస సౌకర్యాలు లేవని, వార్డెన్ స్థానికంగా ఉండడం లేదని, విద్యార్థులకు దుప్పట్లు ఇవావలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు ప్రవీణ్‌కుమార్, మిథున్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

దిలావర్‌పూర్, మార్చి 26 : కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని న్యూ లోలం గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రంను తహసీల్దార్ స్వాతి ప్రారంభించి చిన్నారులకు తాగునీరు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లవద్దని సూచించారు. ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు తప్పనిసరిగా ఓఆర్ఎస్ దావ్రణం తాగాలని తెలిపారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అజీజ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి శ్రావన్‌కుమార్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ గోవిందుల మహేశ్, స్థానిక నాయకులున్నారు.

అప్రమత్తతే ఆయుధం..

- మండు వేసవిలో భారీగా అగ్ని ప్రమాదాలు
- జిల్లాలో ఈ ఏడాది 131 కేసులు.. రూ.1.58 కోట్ల నష్టం
- రూ.6.55 కోట్ల ఆస్తిని కాపాడిన అధికారులు
- నిబంధనలు పాటించాలని సూచిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదంలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నిర్మల్ అర్బన్, మార్చి 26 : జిల్లాలో రోజు రోజుకూ ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలో అత్యధికంగా 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలో ఎలా ఉంటుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండుతున్న ఎండలతో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదాలపై ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.

131 అగ్ని ప్రమాద కేసులు..

జిల్లా కేంద్రంలో గతేడాది మార్చి నుంచి ఇప్పటి వరకు 131 అగ్ని ప్రమాద కేసులు నమోదైనట్లు అగ్ని మాపక శాఖ అధికారి జయంత్ రాం తెలిపారు. ఇందులో నిర్మల్‌లో 60 అగ్ని ప్రమాదాలు, భైంసాలో 53, ఖానాపూర్‌లో 18 కేసులు నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో రూ.1.58 కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించి మంటలార్పడంతో దాదాపు రూ.6.55 కోట్ల ఆస్తి బూడిదవకుండా కాపాడారు. అందరూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఫైర్ యంత్రం వెళ్లేందుకు అనువుగా లేకుండా భవనాలు నిర్మించడంతో నష్టం పెరిగిపోతున్నదని తెలిపారు. చిన్న చిన్న ప్రమాదాలను సైతం అరికట్టేందుకు మిస్సడు ఫైర్ బుల్లెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ఇండ్లలో అగ్ని ప్రమాదాల నివారణకు..

ఇంటి పరిసరాలను చెత్తాచెదారం లేకుండా జాగ్రత్తగా ఉంచాలి. చిన్నపిల్లలకు కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు వెలగించకుండా చూడాలి. నూతన, పాత ఇండ్లలో ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ పరికరాలను ఉపయోగించాలి. ఎక్కువ రోజులు ఇంటిలో ఉండకపోతే ఎలక్ట్రికల్ మెయిన్‌ను ఆఫ్ చేసి వెళ్లాలి. ప్రమాదం సంభవిస్తే మంటలార్పేందుకు ఎల్లవేళలా నీటిని నిల్వ ఉంచుకోవాలి. గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయడంతో పాటు ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్‌చేయవద్దు. వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ బండ ఉంచొద్దు. పొగతో నిండిన గదుల్లో మోచేతులు, మోకాళ్లపై పాకాలి.

షాపింగ్ మాల్స్, దవాఖానల్లో..

ఆర్‌సీసీ, కాంక్రీట్ స్లాబులను మాత్రమే వాడాలి. ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి. ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఉంచుకోవాలి. హాస్పిటల్, పాఠశాలలను తాటి ఆకులు, గడ్డితో చేసిన పైకప్పు కింద నిర్వహించరాదు. ఫైర్ ఎక్యూప్‌మెంట్లను మూడు నెలలకోసారి క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి.

గోదాములు-గిడ్డంగుల్లో..

గోదాములు గిడ్డంగుల్లో స్టాక్‌ను చెక్క స్లీపర్లపై మాత్రమే నిల్వ చేయాలి. నిల్వల మధ్యలో గ్యాంగ్‌వే, క్రాస్ సెక్షన్లను ఉంచాలి. వస్తువుల నిల్వలు మీటర్ల ఎత్తుకంటే ఎక్కువ నిల్వ చేయరాదు. ట్రక్కుల ఇంజన్లను ఆఫ్ చేసి వస్తువులను లోడ్ చేయాలి.

కర్మాగారాల్లో..

కర్మాగారాల్లోని పరిసరాల్లో చెత్తా చెదారం ఉంచకూడదు. ఉద్యోగులందరికీ ఫైర్ ఫైటింగ్‌లో శిక్షణ ఇవ్వాలి. అగ్ని ప్రమాదాలు జరిగే ప్రదేశాలు గుర్తించాలి. మిషనరీ బెల్టులు, విద్యుత్ పరికరాల నుంచి నిప్పు రవ్వలు రాలకుండా జాగ్రత్త వహించాలి. విద్యుత్ లోడ్‌లో హెచ్చు తగ్గులు లేకుండా చూడాలి.

గ్రామీణ ప్రాంతాల్లో...

పూర్తిగా ఎండిన గడ్డిని మాత్రమే వాములుగా వేయాలి. గడ్డివాముల నుంచి ఇండ్లకు తప్పనిసరిగా 60 అడుగుల దూరం పాటించాలి. పెద్ద గడ్డివాములకు బదులు చిన్నచిన్న గడ్డివాములను నిర్మించుకోవాలి. గుడిసెకు, గుడిసెకు మధ్య కనీసం 30 అడుగుల దూరం పాటించాలి.

'డ్రోన్‌లతో సాగు సులభతరం'

కుంటాల, మార్చి 26 : ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ వ్యవసాయంలో లాభాలు గడించవచ్చని డీఏవో అంజిప్రసాద్ అన్నారు. హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్త రామగోపాల్ వర్మ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం డ్రోన్ల ద్వారా వ్యవసాయం గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో డీఏవో మాట్లాడారు. ఐఎఫ్ఎఫ్‌సీవో సంస్థ ద్వారా జిల్లాలో ప్రస్తుతానికి దిలావర్‌పూర్, సారంగాపూర్, లక్ష్మణచాంద, పెంబి మండలాల్లో ఈ కిసాన్ డ్రోన్స్ పథకం ద్వారా పంటలపై నానో యూరియా పిచికారీ చేసేందుకు రైతులకు డ్రోన్లను అందుబాటులోకి తేనున్నట్టు పేర్కొన్నారు. ఇది నానో యూరియాతో పాటు నానో డై అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ), ఇతర రసాయనాలను పిచికారీ చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. పీఎం కిసాన్ సంవృద్ధి కేంద్రాల్లో సబ్సిడీ ధరపై త్వరలో రైతులకు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో మిగతా మండలాలకు కూడా డ్రోన్ల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కుంటాల ఏవో సోమ లింగారెడ్డి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నర్సరీ, ప్రకృతి వనం పరిశీలన

దస్తురాబాద్, మార్చి 26 : వేసవి దృష్ట్యా ప్రకృతి వనాలు, నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. మండలంలోని ఆకొండపేట గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతి వనం, నర్సరీని పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె ప్రకృతి వనంలో, హరిత హారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కల చుట్టూ గుంతలను తీసి, నీరందించాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెరుగుదలపై దృష్టిపెట్టాలని సూచించారు. రికార్డుల్లో వివరాల నమోదులో అలసత్వం చూపవద్దన్నారు. నీటి ఎద్దడి లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు ఉన్నారు.

'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు'

కుంటాల, మార్చి 26 : మండలంలోని మహిళా సంఘాలకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో గ్రామ వీవో అధ్యక్షురాలు చైర్‌పర్సన్‌గా, హెచ్ఎం కన్వీనర్‌గా, విద్యార్థుల తల్లిదండ్రులు సభ్యులుగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఇటీవలే ఏర్పాటయ్యాయని ఏపీఎం అశోక్ అన్నారు. మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూల్ యూనిఫాం కుట్టే సామర్థ్యం గల మహిళా సంఘాలను గుర్తించి, వారికి వెంటనే ఆర్డర్ అందించాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వం కల్పించబోతున్నదని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెస్ అధ్యక్షురాలు బ్యాగరీ లక్ష్మి, సీసీలు పెంటన్న, యూసుఫ్, అకౌంటెంట్ శివప్రసాద్, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి శిక్షణ

- నేటి నుంచి ప్రారంభం
- కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి బుధవారం నుంచి శిక్షణ ఇస్తామని కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్మల్‌లో విధులు నిర్వహించే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరుగుతున్నదని తెలిపారు. నిర్మల్ కలెక్టరేట్‌లో పీవోలు, ఏపీవోలకు బుధవారం శిక్షణ ఉంటుందని.. సెయింట్ థామస్ పాఠశాలలో శిక్షణ తరగతులకు సిబ్బంది హాజరు కావాలని కోరారు. 1,2 తేదీల్లో ఖానాపూర్ వారికి స్థానిక ఉన్నత పాఠశాలలో, ముధోల్ వారికి బాసరలోని ట్రిబుల్ ఐటీలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, అధికారులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, నదీం పాల్గొన్నారు.

ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

ర్యాలీగా వెళ్తున్న వైద్యులు, ఆశ కార్యకర్తలు

భైంసా, మార్చి 26 : పట్టణంలోని పీహెచ్‌సీలో మంగళవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు దగ్గనప్పుడు, తెమడ రావడం, సాయంత్రం వేళల్లో జ్వరం, నిద్రలో అకస్మాత్తుగా చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనబడితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యాధి సోకిన వారు తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అందుకు సంబంధించి 6 నుంచి 9 నెలలపాటు మందులు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు ఫిర్దోస్ జబీన్, ఆశ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ కొనసాగించాలి

కడెం, మార్చి 26 : గతంలో ప్రారంభమైన ఉపాధ్యాయ, ఉద్యోగుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియను కొనసాగించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. కడెం మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేశ్‌నాయక్ మాట్లాడారు. సాధారణ ఎన్నికల దృష్ట్యా ఈసీ ముందస్తు అనుమతి తీసుకొని, వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందే ఈ బదిలీల ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘానికి వివరించి, అనుమతులు తీసుకోవాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, నాయకులు ధర్మాజి చాందిని, జిల్లా గౌరవ అధ్యక్షుడు రవీందర్ తదితరులున్నారు.

కుష్టు నివారణే లక్ష్యంగా పనిచేయాలి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 26 : కుష్టు నివారణే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం కుష్టు వ్యాధిపై అవగాహన పత్రికలను ఆవిష్కరించారు. జిల్లాలో కుష్టు నియంత్రణే ధ్యేయంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారణ చేయాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే సత్వరమే చికిత్స అందించాలన్నారు. గ్రామాల్లో కుష్టుపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రోగ్రాం అధికారి రవీందర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, డీపీఎంవో రాజేశ్వర్, లెప్రా సొసైటీ బాధ్యులు కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, అధికారులు

ముగిసిన కుష్టు సర్వే..

జిల్లాలో ఈ నెల 11 నుంచి చేపట్టిన కుష్టు గుర్తింపు ఇంటింటా సర్వే మంగళవారంతో ముగిసింది. గ్రామాలు, పట్టణాల్లో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేశారు. అనుమానితులకు పరీక్షలు నిర్వహించారు. రాంనగర్ దవాఖానలో పీవో రవీందర్‌రెడ్డి సర్వే వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలం

దస్తురాబాద్, మార్చి 26 : పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చిత్రకళ అన్నారు. మండల కేంద్రంలో, మున్యాల గ్రామంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ్ పక్వాడ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, చిరుధాన్యాలపై గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చిరు ధాన్యాలతో పాటు ఆకు కూరలు, పాలు, గుడ్లు తీసుకోవడంతో ఆరోగ్యం బాగుంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూపతిరెడ్డి, మల్లేశ్, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు రత్నమాల, భారతి, సుగుణాదేవి, సరోజ, ప్రేమలత, రాజేశ్వరి, సంధ్యారాణి, అమృత, వీవోఏలు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చిత్రకళ

మూడోరోజూ నవ చండీయాగం

హోమంలో పాల్గొన్న దంపతులు

సోన్, మార్చి 26 : అక్కాపూర్‌లోని రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి మూడోరోజూ మంగళవారం గీతా పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో నవ చండీయాగం నిర్వహించారు. పలువురు దంపతులు హోమంలో పాల్గొన్నారు. గురుమంచు చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు విద్యాసాగర్ శాస్త్రి, శివరామకృష్ణ తదితరులతో పాటు వివిధ పుణ్యక్షేత్రాల నుంచి విచ్చేసిన వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు లింగాగౌడ్, జీవన్‌గౌడ్, రమణగౌడ్, కృష్ణమోహన్‌గౌడ్, రాజాగౌడ్, దేవేందర్‌గౌడ్, వేణుగోపాల్‌గౌడ్, దశగౌడ్, రవీందర్‌గౌడ్, నర్సాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పది పరీక్షలకు 20 మంది గైర్హాజరు

నిర్మల్ అర్బన్, మార్చి 26 : జిల్లాలో మంగళవారం 47 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం నిర్వహించిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 8,923 మందికి గాను 8,903 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

నిర్మల్ అర్బన్, మార్చి 26 : నిర్మల్ ఆర్టీసీ డిపో నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు ఆర్టీసీ లహరి స్లీపర్ కోచ్ సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి తెలిపారు. ముందుగా బుక్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ సదుపాయాన్ని కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలకు స్వస్తిపలికి ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకొని సురక్షింతగా గమ్యస్థానానికి చేరుకోవచ్చని తెలిపారు.

వాటర్‌బెల్ ప్రోగ్రామ్ అమలు చేయాలి

భైంసా, మార్చి, 26: ఎండలు తీవ్ర రూపం దాల్చుతున్నందున పాఠశాలల్లో వాటర్‌బెల్ ప్రోగ్రాం ప్రారంభిస్తే విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని సామాజిక కార్యకర్త, గాంధీ బాల సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జాదవ్ పుండలిక్ రావు పాటిల్ కోరారు. ప్రతికాలాంశానికి ఒకసారి విద్యార్థులందరూ తప్పనిసరిగా నీరు తాగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు. విద్యార్థులు పాఠశాలలో ఉన్నప్పుడు కనీసం మధ్యాహ్నం వరకు ఒక విద్యార్థి ఒక లీటరు నీరు తాగేలా చూడాలని కోరారు.

జడ్పీసీఈవో సమీక్ష

నిర్మల్ టౌన్, మార్చి 26 : జిల్లాలోని ఆయా మండలాల ఎంపీడీవోలతో జడ్పీసీఈవో గోవింద్ మంగళవారం జడ్పీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వపరంగా చేపట్టిన కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుందని, అప్పటిలోగా పనులు పూర్తిచేసి, వాటి రికార్డులను సంబంధిత అధికారులకు అందించాలని తెలిపారు. ఉపాధి హామీ పనులు పూర్తిచేయాలని కోరారు. గ్రామాలను సందర్శించి, తాగునీరు, ఇతర సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల నిర్వహణపై మండలంలో కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

నేడు జిల్లా సమావేశం

నిర్మల్ టౌన్, మార్చి 26 : జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో కార్యాలయంలో బుధవారం లంబాడా(బంజారా) మేధావుల సమావేశం నిర్వహిస్తునట్లు జేఏసీ నాయకలు అశోక్‌నాయక్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో సమస్యలపై చర్చించి, భవిషత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. లంబాడాల పోరు గర్జన, ఎన్నికల్లో లంబాడాల పాత్ర తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

విష్ణేష్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 26 : చించోలి(బీ) ఉన్నత పాఠశాల తొమ్మిదోతరగతి విద్యార్థి చాట్ల విష్ణేష్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రమేశ్ తెలిపారు. 29 నుంచి ఏప్రిల్ 1 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వీరిని పీడీ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శ

కుంటాల, మార్చి 26 : అందకూర్‌లో కట్టోల్ల మోహన్ ఇటీవల గుండెపోటుతో, ఓలాలో మాజీ సర్పంచ్ ఎగ్గాం చిన్న గజ్జారాం వదిన మల్లవ్వ అనారోగ్యంతో మృతిచెందారు. కాగా, మంగళవారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సౌదరి లక్ష్మణ్ పటేల్, ఎర్రోజు ప్రశాంత్, దిగంబర్, వెంగళ్ రావు,